నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | MEDAK

బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

గులాబీ దండు కదంతొక్కాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, ఏప్రిల్ 17: ఈనెల 27న ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు గులాబీ దండు వేలాదిగా తరలివచ్చి కదంతొక్కాలని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం సదాశివపేటలో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతుందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్‌ను ఆశీర్వదించడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, శివరాజ్‌పాటిల్, శ్రీనివాస్‌నాయక్, విద్యాసాగర్‌రెడ్డి, ముబీన్ మోహినోద్దిన్, నసీర్‌బాయ్, సత్యం, సాతాని శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, కోడూరి అంజన్న, చౌదరి ప్రకాశ్, రాజు, విజయ్‌కుమార్, బరాడిసాయి, బోడపల్లి అవినాశ్, దిడిగె నగేశ్ పాల్గొన్నారు.



రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి

కంది, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే గురువారం సంగారెడ్డిలో చలో వరంగల్ వాల్ పెయింటింగ్స్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా సభకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, గ్రామగ్రామాన సభకు సంబంధించిన వాల్ పోస్టర్లు అతికించాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, కొండల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి సభకు తరలుదాం

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవపూర్ ఏప్రిల్17: ఊరూవాడ కదులుదాం.. ఎల్కతుర్తి సభకు తరలుదామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జగదేవపూర్ కేశిరెడ్డి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన వరంగల్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25ఏండ్లు అవుతున్న సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రజలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు. మార్పు రావాలి, మార్పు రావాలి అంటే కాంగ్రెస్ వచ్చింది. కానీ పేదల గుండెల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. పదేండ్లు అధికారంలో లేకపోయేసరికి అధికారంలోకి వచ్చిననాటి నుంచే కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి, సంక్షేమాన్ని మరచి అందినకాడికి దోచుకోవడం, దాచుకోవడానికి ఎగపడ్డారని విమర్శించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం కాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు వస్తారనే భయంతో ఇప్పటికే కాంగ్రెస్ నాయకుల్లో ఒణుకుపుడుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, జగదేవపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, యాదవరెడ్డి, మాజీ సర్పంచులు నరేశ్, యాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, నాయకులు కనకయ్య, చంద్రం, ఆయా గ్రామాల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

చలో వరంగల్ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి, మండల నాయకులు

రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 17: ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే కేసీఆర్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిన్నశంకరంపేటలో వరంగల్ బహిరంగ సభకు సంబంధించిన వాల్‌రైటింగ్ రాశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ ఏర్పడి 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఎందుకు చేయడం లేదని, అర్హతలు ఉన్న రైతులకు రుణమాఫీ, రైతుభరోసా ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ముఖ్య నాయకులపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని, మళ్లీ కేసీఆర్ సీఎం కావాని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మెదక్ నియోజకవర్గం నుంచి వరంగల్ సభకు తరలివెళ్లేందుకు ప్రజలు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మాజీ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిండ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పట్లోరి రాజు, బీఆర్ఎస్ చిన్నశంకరంపేట పట్టణ అధ్యక్షుడు హేమ చంద్రం, మాజీ సర్పంచ్ రమేశ్, నరేశ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో వాల్‌రైటింగ్ రాస్తున్న మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

ఇక్రిశాట్‌లో చిరుత పట్టివేత

ఇక్రిశాట్‌లో బోనులో పట్టుబడ్డ చిరుత

పటాన్‌చెరు రూరల్, 17: అంతర్జాతీయ మెట్టపంటల పరిశోధన కేంద్రం ఇక్రిశాట్‌లో చిరుతపులిని అటవీశాఖ అధికారులు బోనుపెట్టి పట్టుకున్నారు. పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో చిరుతపులి సంచారాన్ని గమనించిన ఉద్యోగులు, స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు ఇక్రిశాట్‌లో బోన్లు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. అత్యాధునికమైన టాప్ కెమెరాల ద్వారా చిరుత కదలికలను గుర్తించిన అధికారులు గురువారం తెల్లవారుజామున చిరుతను బోనులో బంధించారు. చిరుతను బంధించడంతో ఇక్రిశాట్‌తోపాటు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు చిరుతను నెహ్రూ జూపార్క్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ చిరుత ఉందన్న సమాచారం మేరకు బోను పెట్టి పట్టుకున్నామన్నారు. జనవాసాలకు దగ్గరగా ఉండటంతో ప్రత్యేకంగా కృషి చేసినట్లు వివరించారు. చిరుత ఆరోగ్యంతో ఉందని, జూపార్క్‌లో వైద్యులు పరీక్షలు నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటారన్నారు. చిరుతను పట్టుకోవడంలో పని చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

ధాన్యం.. దైన్యం

సిద్దిపేట జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు షురూ..

- పంట దిగుబడి అంచనాకు.. కొనుగోలు లక్ష్యానికి 3లక్షల మెట్రిక్ టన్నుల వ్యత్యాసం
- 419 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన
- ఇప్పటికీ 230 కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 8లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 1.25 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కాగా... అందుబాటులో 40 లక్షల గన్నీ బ్యాగులు
- కేంద్రాల్లో వేధిస్తున్న సమస్య

సిద్దిపేట, ఏప్రిల్ 17: యాసంగి వరికోతలు షురూ కావడంతో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ద్వారా 211 కేంద్రాలు, పీఏసీఎస్ ద్వారా 202 కొనుగోలు కేంద్రాలు, మెప్మా ద్వారా 6 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. యాసంగిలో జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ, జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో దొడ్డు వడ్లు 4.70 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, సన్నాలు 30వేల మెట్రిక్ టన్నులు సేకరించనున్నారు. ఏప్రిల్ 1 తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో 239 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇందులో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు 149, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు 81 ఉన్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 98 మెట్రిక్ టన్నుల పైలుకు ధాన్యాన్ని సేకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో సుమారుగా 1.25 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, కేవలం 40 లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు 2వేల గన్నీబ్యాగులు జిల్లాకు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు 12,482 టార్పాలిన్ కవర్లు అవసరం ఉండగా, ప్రస్తుతం 8882 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మాయిశ్చర్ మీటర్లు 798 అవసరం ఉండగా, 667 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ధాన్యాన్ని తూకం వేసేందుకు 838 కాంటాలు అవసరం కాగా, జిల్లాలో 762 మాత్రమే ఉన్నాయి. ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు అవసరమైన ప్యాడీ క్లీనర్లు 634 అవసరం ఉండగా, 584 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకుండానే అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సరిపడా గన్నీబ్యాగులు, టార్పాలిన్ కవర్లు, ప్యాడీక్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లు అందుబాటులో లేవు. దీంతో ధాన్యం సేకరణకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. తద్వారా రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. అకాల వర్షాలు, వడగండ్లు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడిస్తే ఇబ్బందులు తప్పవని భయాందోళన చెందుతున్నారు. ఈసారి యాసంగి సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీటి సమస్య, అప్రకటిత విద్యుత్ కోతలతో చాలా చోట్ల పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు. తీరా ఇప్పుడు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకుండానే సెంటర్లు ప్రారంభించడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

ప్రారంభం సరే.. కొనుగోళ్లేవి?

- మెదక్ జిల్లాలో జోరందుకున్న వరి కోతలు
- కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యం
- కొనుగోళ్లు లేక రైతుల్లో ఆందోళన
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం

రామాయంపేట మండలం దామరచెర్వు సర్వీస్ రోడ్డులో ఆరబోసిన వడ్లు

మెదక్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో సెంటర్లకు ధాన్యం వస్తున్నా కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కావడం లేదు. మెదక్ జిల్లాలో 480 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పలుచోట్ల కేంద్రాలు ప్రారంభమైనా నిర్వాహకులు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. దీంతో అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాలతో పాటు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో సెంటర్ల వద్ద సౌకర్యాలు కల్పించి, తేమ శాతం ఉన్న వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని కోరుతున్నారు. పదిహేను రోజుల నుంచి కోతలు మొదలు కాగా.. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొంత మంది రైతులు ముందుగానే కోతలు కానిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టే రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడే మూడు నాలుగు రోజులు ఆరబోసి, ఇక కొంటారని ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఎండబెట్టి విక్రయించేందుకు తెస్తే.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రైతులు నిరాశ చెందుతున్నారు. వారం క్రితమే పలు చోట్ల ప్రజాప్రతినిధులు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించినా కొనుగోళ్లు మొదలు కాక అక్కడే రైతులు పడిగాపులు కాస్తున్నారు. యాసంగి సీజన్‌లో మెదక్ జిల్లాలో 2,46,136 ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఇందులో దొడ్డు, సన్నరకం కలిపి 3,89,774 మెట్రిక్‌టన్నుల ధాన్యం సెంటర్లకు రానుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు జిల్లాలో 480 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇందులో సన్నధాన్యం కోసం 90 కొనుగోలు కేంద్రాలు, దొడ్డు రకం కోసం 390 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 324 కేంద్రాలు, డీసీఎంఎస్ 10 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 127 కొనుగోలు కేంద్రాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో 19 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెలలో 371 కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. అయితే కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించినా ఎక్కడా కొనుగోళ్లు మాత్రం చేయడం లేదు. దీంతో రైతులకు నిరాశ తప్పడం లేదు.

ప్రజలు కేసీఆర్‌నే మళ్లీ కోరుకుంటున్నారు

- బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు మార్కెట్ రోడ్డులోని జేపీ కాలనీలో గోడలపై వాల్ రైటింగ్ రాస్తున్న నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం కావడంతో మరోసారి కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని జేపీ కాలనీతోపాటు బండ్లగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి, గోడలపై వాల్ రైటింగ్ రాశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావాలని ప్రజలు స్వచ్ఛందగా వరంగల్‌లో నిర్వహించే సభకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుతున్నారని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా సబ్బండ వర్గాలు ఒక్కతాటిపైకి వచ్చి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పుట్టిందని తెలిపారు. వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దేశం మొత్తం వరంగల్ సభ వైపు చూస్తుందని, బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రచారం చేస్తున్నామన్నారు.

బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా భరత్

బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా భరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. వరంగల్ సభను విజయవంతం చేయడంతోపాటు బండ్లగూడలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. బడ్లగూడ నుంచి వరంగల్ సభకు భారీగా ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, నాయకులు శ్రీధర్ చారి, మాణిక్‌యాదవ్, నవీన్, రామకృష్ణ, సాయి, జానీ పాల్గొన్నారు.

భూభారతికి స్పందన కరువు

సిద్దిపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సిద్దిపేట అర్బన్/నంగునూరు, ఏప్రిల్ 17: భూ సమస్యల పరిష్కారం దిశగా ధరణి స్థానంలో కొత్తగా భూభారతి పోర్టల్ రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని సిద్దిపేట అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో, నంగునూరు మండల కేంద్రంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో భూభారతి చట్టం 2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈమేరకు భూభారతి చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సర్వే నెంబర్‌కు జియో భూధార్ కార్డులను జారీ చేయనున్నట్లు, ప్రతి గ్రామంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రికార్డులను నిర్వహిస్తామన్నారు.

హాజరుకాని రైతులు

భూభారతి పోర్టల్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు రైతుల నుంచి స్పందన కరువైంది. సిద్దిపేట అర్బన్ మండలానికి సంబంధించి అవగాహన సదస్సును సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో ఏర్పాటు చేయగా.. ఆశించిన స్థాయిలో రైతులు హాజరుకాలేదు. రైతుల కోసమే ఏర్పాటు చేసిన భూభారతి పోర్టల్ అవగాహన సదస్సుకు కేవలం కొంత మంది కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. రైతులకు ఉపయోగపడే ఈ పోర్టల్ సంబంధించిన అవగాహన సదస్సు జరిగితే రైతుల నుంచి స్పందన కరువైందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో సదానందం, తహసీల్దార్లు సలీం, సరిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- వెంకర్ కెమికల్స్‌లో సాల్వెంట్స్ వికటించి ఎగసిన నిప్పురవ్వలు
- తృటిలో తప్పించుకున్న కార్మికులు
- నాలుగు ఫైరింజన్లతో మంటలు అదుపులోకి...

వెంకర్ కెమికల్స్ పరిశ్రమలో ఫోమ్‌తో మంటలను ఆర్పుతున్న ఫైర్‌ఫైటింగ్ సిబ్బంది

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 17: జాతీయ అగ్నిప్రమాదాల భద్రతా వారోత్సవాల వేళ పాశమైలారంలోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం వెంకర్ కెమికల్స్ పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్లాంట్ మొత్తం వ్యాప్తి చెందగా స్పందించిన ఇరుగుపొరుగు పరిశ్రమల యాజమాన్యాలు మంటలు ఇతర పరిశ్రమలకు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో ఫస్ట్ షిఫ్ట్‌కు వచ్చిన 40మంది కార్మికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. టిఫిన్ చేయడానికి బయటకు వచ్చారు. నలుగురు మాత్రమే పరిశ్రమలో ఉన్నారు. సాల్వెంట్స్ డ్రమ్స్ నిలువ ఉన్నచోట సాల్వెంట్స్ వికటించి నిప్పురవ్వలు ఎగిశాయి. దీంతో చూస్తుండగానే అగ్నిరాజుకున్నది. డ్రమ్ములు పేలిపోతుండటంతో శబ్దాలతో కార్మికులు పరుగులు తీశారు. అధికశాతం మంది గేటు బయటే ఉండటంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అగ్ని ప్లాంట్ మొత్తం వ్యాపిస్తుండటం గమనించిన పక్కనే ఉన్న అరబిందో ఫార్మా , శ్రీకర పరిశ్రమల భద్రత బృందం, ఐలా భద్రత బృందాలు వెంకర్‌లోకి వచ్చి అగ్ని విస్తరించకుండా నిలువరించారు. అంతలో ఐలా ఫైరింజన్లు రెండు రావడంతో ఫోమ్ వెదజల్లి మంటలను అదుపులో ఉంచారు. పటాన్‌చెరు నుంచి, సంగారెడ్డి నుంచి ఫైరింజన్లు రావడంతో మంటలను పూర్తిస్థాయిలో ఆర్పేశారు. పరిశ్రమలో ఫైర్‌సేఫ్టి సరిగ్గా లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తెలుస్తున్నది. భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఆస్తినష్టం వివరాలు పరిశ్రమ యాజమాన్యం వెల్లడించలేదు. వెంకర్‌లో అగ్ని ప్రమాదం అని తెలియగానే కార్మికుల కుటుంబాల్లో టెన్షన్ నెలకొంది. కార్మికులకు, పరిశ్రమ సిబ్బందికి ఫోన్లు చేసి అందరూ క్షేమం అని తెలుసుకొని కార్మికుల కుటుంబాలు రిలీఫ్ అయ్యాయి. వెంకర్ పరిశ్రమను బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ సందర్శించి అగ్నిప్రమాదం వివరాలు సేకరించారు.

నర్సాపూర్‌లో వనగండ్ల వాన

నర్సాపూర్: బ్రాహ్మణపల్లిలో ఈదురు గాలులకు ఎగిరిపోయిన ఇంటి రేకులు

నర్సాపూర్‌లో కురిసిన వడగండ్లు

నర్సాపూర్, ఏప్రిల్ 17: నర్సాపూర్ పట్టణంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం సాయంత్రం వడగండ్ల వాన కురిసి జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. వాన, వనగండ్లతో పాటు ఈదురుగాలులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నీరుడి పెంటయ్య ఇంటి రేకులు ఈదురుగాలులకు పూర్తిగా కొట్టుకుపోయాయి. నారాయణపూర్ ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడడంతో పాటు మూడు స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వగనండ్ల వానతో రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చేతికొచ్చిన వరి పంట వనగండ్లకు నేలరాలడంతో రైతన్నలు ఆవేదన చెందారు. వనగండ్ల వానతో పంట నష్టం తీవ్రంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

చిన్నశంకరంపేట మండలంలో...

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 17: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. శాలిపేట, మిర్జాపల్లి తదితర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. ఒక్కసారిగా గాలివాన రావడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. గాలివానకు మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మామిడితోటల్లో మామిడి కాయలు నేలరాలి, చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. గాలివాన బీభత్సంతో పాటు వడగండ్ల వర్షం కురియడంతో చేతికి అందిన పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే చేతికి అందిన పంట నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్